నమస్తే తెలంగాణ
నిజామాబాద్
10 నిజామాబాద్, శనివారం 11 మే 2024 NIZAMABAD



జిల్లా కేంద్రంలోని హనుమాన్ జంక్షన్ వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు హాజరైన నగరవాసులు

# ప్రచార పర్వం నేటితో సమాప్తం

**సాయంత్రం 5 గంటలకు మైకులు బంద్**

***హోరాహోరీగా*** *కొనసాగిన సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి నేటితో తెరపడనున్నది. శనివారం సాయంత్రం 5గంటలకు అభ్యర్థుల ఓట్ల వేట ముగియనుంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజకీయ పార్టీలు ఇక మైకులను బంద్ చేసుకోవాల్సి ఉంటుంది. నిర్ణీత గడువును దాటి ప్రచారం నిర్వహిస్తే ఈసీ నిబంధనల మేరకు శిక్షార్హులవుతారు. ఎన్నికల నోటిఫికేషన్ నుంచి నామినేషన్ల ముగింపు వరకు స్తబ్ధంగా జరిగిన ప్రచార కార్యక్రమాలు.. రెండు వారాలుగా ఊపందుకున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో అడుగడుగునా తనిఖీలతో అదరగొట్టిన ఎన్నికల యంత్రాంగం ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో అంతగా ప్రభావం చూపలేకపోయింది. బృందాలు విస్తృతంగా తిరగపోవడంతోపాటు చెక్‌పోస్టులు కూడా ఎక్కువగా కనిపించలేదు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో జాతీయ రహదారులు, జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీలు చేయగా, ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. పోలింగ్ సమయం దగ్గర పడడంతో ఎన్నికల యంత్రాంగం విస్తృతంగా ఏర్పాట్లు చేయడంపై దృష్టి సారించింది.*

*–నిజామాబాద్, మే 10, (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



**ఎన్నికల** రణరంగంలో ప్రధానంగా బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రజల్లోకి దూసుకుపోతూ కాంగ్రెస్, బీజేపీ తీరును తీవ్రంగా ఎండగట్టారు. వారి మోసపూరిత హామీలను జనాలకు వివరించే ప్రయత్నం చేయడంలో విజయవంతమయ్యారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ చేస్తున్న కుట్రలను బీఆర్ఎస్ శ్రేణులు ఎక్కడికక్కడ తిప్పికొట్టారు. మే 6, 7 తేదీల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గులాబీ బాస్ కేసీఆర్ నిర్వహించిన రోడ్‌షో, బస్సుయాత్రకు తండోపతండాలుగా తరలిరావడంతో బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఏమాత్రం ఆదరణ తగ్గలేదని స్పష్టమైంది. దీనికి తోడు కేసీఆర్ రెండు రోజుల టూర్ గులాబీ శ్రేణుల్లో మరింత జోష్ నింపింది. నిజామాబాద్‌లో ఒకరోజు బస చేయడంతోపాటు నెహ్రూ పార్కులో నిర్వహించిన రోడ్‌షోలో ప్రజలనుద్దేశించి కీలక ప్రసంగంతో ఆకట్టుకున్నారు. కామారెడ్డిలోని జేపీఎన్ రోడ్డులోనూ ఆయన స్పీచ్‌కు జనం ముగ్ధులయ్యారు. కేసీఆర్ టూర్ తర్వాత ఎన్నికల రణక్షేత్రంలో ప్రజలు గులాబీ పార్టీ వైపే మళ్లినట్లుగా రాజకీయ విశ్లేషకులు సైతం అంచనా వేస్తున్నారు. గెలుపు బాటలో బీఆర్ఎస్ పార్టీ దూసుకు పోతున్నట్లుగా పలు సర్వేలు సైతం తేటతెల్లం చేస్తున్నాయి.

## కాంగ్రెస్, బీజేపీలో గుబులు

జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలో పార్లమెంట్ ఎన్నికలు గుబులు పుట్టిస్తున్నాయి. నిజామాబాద్, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో క్యాడర్ అసంతృప్తి ఓటింగ్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం కనిపిస్తున్నది. దీంతోపాటు రెండు ప్రభుత్వాలపై వ్యతిరేకత కనిపిస్తుండంతో ఆయా పార్టీల పెద్దలు అయోమయానికి గురవుతున్నారు. ప్రచార పర్వంలో స్పందన లేకపోవడం, అడుగడుగునా నిరసనలు, నిలదీతలతో జాతీయ పార్టీలకు నెత్తి పట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం, అభివృద్ధిపై హామీలు ఇవ్వకపోవడం, ఇచ్చిన హామీల అమలుపై దాటవేత ధోరణితో జనం నుంచి తప్పించుకొని తిరిగాల్సి వచ్చింది. బీఆర్ఎస్ ఒక్కటే ఆశాదీపంగా ప్రజలు భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల శాతం తేడాతో అధికారాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీకి ఈసారి భారీగా మద్దతు దక్కనుందని అంచనాలు వినిపిస్తున్నాయి. 2019 ఎన్నికల్లో అర్వింద్‌కు తమ పార్టీ సపోర్టు చేసిందంటూ కాంగ్రెస్ నేతలు బాహాటంగానే చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతుండగా, వారి కుమ్మక్కు రాజకీయాలను తేటతెల్లం చేస్తున్నాయి. 2024 లోనూ అదే రీతిలో ఏమైనా లోపాయికారి ఒప్పందాలు జరిగి ఉంటాయని సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, దీనిపై ప్రజలు చర్చించుకుంటున్నారు.



మాట్లాడుతున్న బాజిరెడ్డి, పక్కన బిగాల

- సోమవారం పోలింగ్‌కు విస్తృత ఏర్పాట్లు
- రెండు వారాలపాటు హోరాహోరీగా సాగిన ప్రచార పర్వం
- బీజేపీ, కాంగ్రెస్ కన్నా ముందున్న బీఆర్ఎస్ అభ్యర్థులు
- తూతూ మంత్రంగానే ఎన్నికల తనిఖీలు

## మద్యం షాపులు బంద్

వినాయక నగర్, మే 10: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నేటి (శనివారం) సాయంత్రం 5 నుంచి ఈ నెల 14వ తేదీ ఉదయం 6 గంటల వరకు మద్యం షాపులు, కల్లు దుకాణాలు, బార్లు, క్లబ్బులు బంద్ పాటించాలని సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా కూడా బంద్ పాటించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూన్ 4న ఉదయం నుంచి 5వ తేదీ 6 గంటల వరకు బంద్ ఉంచాలని సూచించారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు బంద్ పాటించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

# కాంగ్రెస్‌కు రోజులు దగ్గర పడ్డాయి

- నిజామాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్
- బాజిరెడ్డిని ఢిల్లీకి పంపుదాం : బిగాల గణేశ్‌గుప్తా

ఖలీల్‌వాడి మే 10: ఒక్క హామీని కూడా అమలు చేయని కాంగ్రెస్ పార్టీని ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయని బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్ హనుమాన్ జంక్షన్‌వద్ద, డెయిరీ ఫారం వద్ద శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తాతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీలు అంటూ అనేక హామీలిచ్చారని, కనీసం కేసీఆర్ తెచ్చిన రైతు బంధు, కల్యాణలక్ష్మి పథకాలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడంలేదన్నారు. అర్వింద్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ.. పసుపు బోర్డు తేనోడు మళ్లీ గెలిచి తీసుకువస్తాడా అని ప్రశ్నించారు. పదేండ్లు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే దిక్కులేదు కానీ, ఇప్పుడు తెస్తానని అంటున్నాడని ఎద్దేవా చేశారు. నిజామాబాద్‌లో అర్వింద్ ఒక్క అభివృద్ధి పని కూ డా చేయలేదన్నారు. అందుకే మోదీని చూపిస్తూ ఓట్లు అడుకుంటున్నాడని, ప్రజలకు సమస్యలు వస్తే ఎవరి దగ్గరికి వెళ్లాలో చెప్పాలన్నారు. తనను గెలిపిస్తే ప్రజల్లోనే ఉంటూ అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

**బాజిరెడ్డి టైగర్ : బిగాల గణేశ్‌గుప్తా**

అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా మాటాల్డుతూ.. బాజిరెడ్డి టైగర్ అని, కాంగ్రెస్ కుట్రలు, బీజేపీ లాంటి మతోన్మాద శక్తులను మట్టుబెట్టేందుకు కేసీఆర్ వేసిన అస్త్రం అని అన్నారు. దొంగ వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రూ. 2లక్షల రైతులరుణమాఫీ ఎటుపోయిందో చెప్పాలని ప్రశ్నించారు. రతుల కష్టాలను చూసి కేసీఆర్ బస్సుయాత్ర చేపట్టారని అన్నారు. అర్వింద్ నోరు విప్పితే అబద్ధాలు తప్ప ఏమీ ఉండదన్నారు. ప్రజలు కాంగ్రెస్, బీజేపీని నమ్మే పరిస్థితి లేదని, బాజిరెడ్డిని గెలిపించి ఢిల్లీకి పంపిద్దామని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, నగర మేయర్ దండు నీతూకిరణ్, నాయకులు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్, బీజేపీలు విఫలం

- ఆ పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి
- ప్రశ్నించే గొంతుక బాజిరెడ్డిని ఆశీర్వదించండి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్/మెండోరా (ముప్కాల్)/బాల్కొండ, మే 10 : ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో బీజేపీ, కాంగ్రెస్ పూర్తిగా విఫలమయ్యాయని, ఆ పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని మా జీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన భీమ్‌గల్ మండలం పల్లికొండ, ముచ్కూర్, మెండోరా మండలంలోని బుస్సాపూర్, బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. గ్యారెంటీలతో గారడి చేస్తున్నదని విమర్శించారు. మార్పు కావాలి, మార్పు రావాలంటూ అలవి కాని హామీ లు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ధాన్యం కొనుగోలు, సాగు, తాగు నీటి ఇబ్బందులు ఏర్పడడంలో మార్పు వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 150 రోజులు దాటినా మహిళలు, యువకులు, రైతులకు ఇచ్చిన హామీలు మాత్రం అమలుకావడంలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దేవుడి మీద ఒట్లతో ప్రజలను మభ్యపెడుతూ రోజులు గడుపుతున్నారని అన్నారు. పదేండ్లలో కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి, అభివృద్ధి పనులు చేపట్టినా ప్రజలు కాంగ్రెస్ అబద్ధపు హామీలను నమ్మి బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష పాత్ర ఇచ్చారని అన్నారు. ప్రజా తీర్పును స్వీకరించి ప్రజల పక్షాన ఉండి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం పోరాడుతామన్నారు. కాంగ్రె స్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఉండి ఏనా డు మన గ్రామాల్లో పర్యటించలేదన్నారు. ఐదేండ్లు ఎంపీగా ఉన్న ప్రస్తుత బీజేపీ అభ్యర్థి అర్వింద్ ఐదు రోజుల్లో పసుపుబోర్డు తీసుకొస్తానని, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి ఉద్యోగావకాశాలు కల్పిస్తానని చెప్పి మోసం చేశాడని మండిపడ్డారు. గ్రామాల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేని అర్వింద్‌కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన నిలబడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డిని గెలిపించి తనకు తోడుగా బలం ఇవ్వాలని, ఇద్దరం కలిసి ప్రజల పక్షాన హామీల అమలు కోసం కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల మెడలు వంచుతామని పేర్కొన్నారు.



పల్లికొండలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల



పల్లికొండలో రోడ్‌షోకు హాజరైన గ్రామస్తులు

**మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి**

# అబద్ధాల హస్తం పార్టీకి బుద్ధి చెప్పాలి

- హామీలను తుంగులోకి తొక్కిన రేవంత్ సర్కార్
- కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది..
- కేసీఆర్ పదేండ్ల పాలనలో ఎన్నడూ కరువు లేదు..

కోటగిరి/ వర్ని/మోస్రా(చందూర్)/ నస్రుల్లాబాద్, మే 10: అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఎన్నడూ కరువు రాలేదన్నారు. కాంగ్రెస్ వచ్చి కరువు, కష్టాలు తెచ్చిందని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మోస్రా మం డల కేంద్రంతోపాటు పొతంగల్ మండలం కొడిచెర్ల, హంగర్గా, వర్ని మండలం హుమ్నాపూర్, నెహ్రూనగర్, బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామాల్లో జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం, ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడు తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే విద్యుత్, తాగునీటి కష్టాలు వచ్చాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ పథకాలను నిలిపివేసినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు ఇస్తామని హామీ ఇచ్చి, ఒక్క గ్యారంటీని కూడా అమలుచేయలేదని మండిపడ్డారు. ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మహిళలకు నెలకు రూ.2500 ఇస్తున్నారంటూ అవగాహన లేకుండా మాట్లాడారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఆ పథకం అమలుకు నోచుకోలేదని అన్నారు. హామీలతో నమ్మించి గెలిచిన కాంగ్రెస్ పార్టీని ప్రస్తుతం ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేండ్లలో ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి, జడ్పీటీసీలు శంకర్‌పటేల్, బర్దావల్ హరిదాస్, నారోజీ గంగారాం, జడ్పీ కో–ఆప్షన్ మెంబర్ సిరాజ్, మండల కన్వీనర్ ఎజాజ్‌ఖాన్, ఏఎంసీ మాజీ చైర్మన్లు హమీద్, నీరడి గంగాధర్, మల్లేశ్, మున్నీ, వెంకట్‌రెడ్డి, నీరడి ఉదయ్, కల్లాలి గిరి, వెలగపూడి గోపాల్, లీలా శంకర్, కనకారెడ్డి, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొడిచెర్లలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

# మమ్మల్ని ఆగం చెయ్యకండి

- తడిసిన వడ్లను వెంటనే కొనుగోలు చేయాలి
- బీబీపేట్, పాల్వంచ మండల కేంద్రాల్లో రైతుల ఆందోళన



పాల్వంచలో ధర్నా చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

బీబీపేట్/మాచారెడ్డి, మే10: ప్రభుత్వం సకాలంలో వడ్లు కొనుగోలు చేయకుండా తమను ఆగం చేస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలతో ధాన్యం తడిసి తీవ్రంగా నష్టపోతున్నామని, తడిసిన వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా, పాల్వంచ మండల కేంద్రంలోని కామారెడ్డి–సిరిసిల్ల రహదారిపై రైతులు శుక్రవారం ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టకుండా వడ్లు కొనేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. ధాన్యం సేకరణలో ప్రభుత్వ యంత్రాంగం తాత్సారం చేయడంతో వర్షాలకు తడిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్‌మిల్లర్లు సైతం పెద్దమొత్తంలో తరుగు తీస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీబీపేట్ సొసైటీ పరిధిలోనే ఇప్పటి వరకు 24 వేల తడిసిన ధాన్యం బస్తాలు ఉన్నాయన్నారు. వాటిని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పాల్వంచలో అధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. బీబీపేట్‌లో రైతులకు జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, ఎంపీపీ బాలమణి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి దేవునిపల్లి శ్రీనివాస్ తదితరులు మద్దతు తెలిపి కాంగ్రెస్ సర్కారు తీరును ఎండగట్టారు.

# వైద్యం వికటించి బాలింత మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ
- దవాఖాన ఎదుట ఆందోళన



రోడ్డుపై డాక్టర్ వాహనాన్ని అడ్డుకొని ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

ఆర్మూర్‌టౌన్, మే10: కాన్పుకోసం వచ్చిన ఓ గర్భిణి.. పండంటి బిడ్డకు జన్మనిచ్చిన అనంతరం వైద్యం వికటించి మృతిచెందింది. డాక్టర్ నిర్లక్ష్యంతోనే బాలింత చనిపోయినట్లు బంధువులు ఆరోపించారు. మృతురాలి భర్త సాయిలు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలూర్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన పిట్ల సుమలత (25)ను కాన్పుకోసం ఆర్మూర్‌లోని తిరుమల దవాఖానకు గురువారం తీసుకెళ్లారు. గతంలో ఆమెకు రెండు నార్మల్ డెలివరీలు కాగా, సుమలతను పరీక్షించిన డాక్టర్ శ్రీదేవి.. ఈసారి సిజేరియన్ తప్పదని తెలిపింది. కుటుంబ సభ్యులు అంగీకరించడంతో డెలివరీ చేశారు. మగ శిశువుకు జన్మనిచ్చిన అనంతరం సుమలత.. తన కడుపులో మంటగా ఉన్నట్లు చెప్పడంతో అనస్తీషియా వైద్యుడు లేకుండానే డాక్టర్ శ్రీదేవి ఆమెకు మత్తుమందు ఇచ్చారు. దీంతో బాలింతకు హార్ట్‌బీట్ పెరిగి గుండెపోటుతో చనిపోయిందని బంధువులు ఆరోపించారు. డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం ఆందోళనకు దిగారు. డాక్టర్ల వాహనాలను అడ్డుకున్నారు. దవాఖాన ఎదుట బైఠాయించి రాస్తారోకో చేశారు. సమాచారం అందుకున్న ఏసీపీ బస్వారెడ్డి అక్కడికి చేరుకొని బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని ఆందోళనకారులను సముదాయించారు.

